ఇల్లాలి ప్రేమకథ

చీకటి వెనక వెలుగురాక తప్పదు. కాని వెలుగు కోసం వేచి ఉండాలన్న వివేకం ఉండేదీ ఎందరికి ?

ఆఫీసు గేటు దాటింది బస్సు. ఉద్యోగులందరినీ గేటుదగ్గర దింపి మరో క్షణం ఆగింది. అగగానే ముందు పంకజా, ఆమె వెనకాలే ఆరు నెలలు కూడా సర్వీసు పూర్తి చెయ్యని కరుణాకరరావ్ దిగడం బస్సులో వాళ్లకి ఆశ్చర్యాన్ని కలిగించింది. కవ్వించింది. గిలిగింతలు పెట్టింది.

ఆశ్చర్యపోయిన వాళ్లు పంకజ స్వీయ చరిత్ర తెలిసిన వాళ్లు. కవ్వింపు పొందిన వాళ్లు బ్రహ్మచర్యంలోంచి కాలు జారి గృహస్థాశ్రమంలో పడ్డ వాళ్లు. గిలిగింతలు పొందింది మాత్రం ఇద్దరే. నాలుగోపది వచ్చి మీద పడబోతున్న కన్యచెరలోంచి తప్పించుకు బయటపడలేకపోయిన మీనాక్షి, గ్లోరియానా.

పంకజం ముందునుండి దిగితే తను వెనక నుంచి దిగాలనుకున్నాడు కరుణ. కాని తీరా బస్సు ఆగేసరికి ఆ నిర్ణయం జ్ఞాపకమే లేదు. బస్సు లోపలి వాళ్లందరూ తననే చూస్తున్నట్లనిపించి తల దించుకోకుండా ఉండలేకపోయాడు కరుణ.

కండక్టర్ షర్రర్ అని వూల వూదడం, బస్ కదలడం కొద్ది సెకెండ్ల తేడాలో జరిగి బస్సు విలాసంగా కదిలింది.

తల మీదకెత్తి ముందడుగు వేస్తూంది పంకజం.

సీ సెండ్ క్వార్టర్స్ దాటి దిగుడు వెంబడి ముందు పంకజం వెనక కరుణ సాలోచనగా నడుస్తున్నారు. నడక వేగం హెచ్చించి పంకజం పక్కకు చేరుతూ కరుణాకరరావ్ అడిగాడు.

''మన బస్సు రామకృష్ణా బీచి పక్కనుంచి వెడితే ఎంత బాగుణ్ను !''

''బస్సులో వెళ్లాలనుకుంటే టెన్‌లో పోయి ఉందుమే... నడకంటే మీకు భయమా ?''

''అలవాటు లేదు.''

''సరే ఇక వెనకకి నడిచినా అంతే దూరమవుతుంది. ముందుకే పోదాం.''

''కాస్త మెల్లగా నడిస్తే.''

''యాజు యూ ప్లీజ్.''

దిగుడు దిగి ఇసుకలోకి వచ్చారిద్దరూ.

''మీ నడకలాగే ఉన్నట్లున్నాయి మీ ఆలోచనలు ఏమిటో అవి ?''

'' ఆలోచించవలసిన అవసరం లేకపోవడం మీ అదృష్టం. కాని మిమ్మల్ని చూసి నేను అసూయ పడుతున్నానని మాత్రం అనుకోకండి.''

''వీళ్లకెందుకింత కంగారో.'' బీచి వెంట నడుస్తున్న ఇద్దరు పాశ్చాత్యుల్ని చూసి అన్నాడు.

''కంగారు కాదు. . ఉత్సాహం.'

''వాళ్ల ఆరోగ్యం.''

'' ఉత్సాహం వల్లనే వస్తుంది ఆరోగ్యమూ.''

సంభాషణ ఎలా ప్రారంభించాలనుకున్నా దిట్టం లేని గాలి పటం దారంలా పుటుక్కున తెగిపోతుంది.

దీనికి కారణాలు చాలా ఉన్నాయ్. సహజంగా పంకజానిది ముభావ స్వభావం... రెండవది, కరుణాకరానికి ఆడవాళ్లతో ఎక్కువ పరిచయం లేకపోవడం. మూడవది ఇలాంటి సంఘటనలు అవే, ఒక అమ్మాయిని పంకజాన్ని అమ్మాయి అనక మరో మాట అనడానికి తెలుగులో వీలవదు - గర్ల్ ఫ్రెండ్ అంటే ఇంగ్లీషవుతుంది, స్త్రీ అంటే పంకజానికి లేని వయసును ఆపాదించినట్లవుతుంది. అమ్మాయి అంటే పెళ్లి కాని పిల్లనే ధ్వనిస్తుంది.

పంకజానికి పెళ్లి అయి ఎన్నేళ్లయిందో ఎవరికీ సరిగా తెలీదు. భర్త గురించిన వివరాలూ ఎవరికీ తెలియవ్. కాని ఆయనగారికీ, ఈవిడకూ పొత్తు కుదరలేదనీ ధైర్యంగా పరిస్థితులని తన అదుపులో పెట్టుకోవడానికి చేసే ప్రయత్నంలో భాగంగా రెండేళ్ల బిడ్డనెత్తుకుని వచ్చి అన్నగారి సాయంతో ఇల్లూ వాకిలీ, అంతకంటే ముఖ్యం ఉద్యోగం వెదుక్కుని విద్యాలయ నగరంలో చిన్న సంసారాన్ని పెట్టుకుని సాగరం ఈదే ప్రయత్నం ప్రారంభించిందని మాత్రం తెలుసు. వివరాలడగడం ఆమె మనసును నొప్పించడమేనని కరుణ అభిప్రాయం.

పంకజం అన్నగారి దగ్గర నుంచి తన కూతురు విషయం విని నేరుగా వచ్చేసింది పంకజం తల్లి కూతురు దగ్గరికి. అదే రోజు పంకజానికి అన్నగారి దగ్గర నుంచి ఉత్తరమూ వచ్చింది.

చెల్లెలు పంకజానికి.

నేను నీకు మాట ఇచ్చిన మేరకు నీ ఉనికిని అమ్మకు తెలియకుండా ఉంచినా చివరకది సాధ్యపడలేదు. అసలు ఆడవాళ్లకు మగాళ్లు దాచే 'సీక్రేట్' ఇన్‌స్టింక్టివ్‌గా తెలిసిపోతాయేమో.

అమ్మ మన మనుకున్నంత పాత కాలపుది కాదు. పాతివ్రత్యానికీ హద్దులు ఉన్నాయని, పత్నీవ్రతం పాటించవలసిన అవసరం పురుషులకూ ఉందనీ, అమ్మ అంత తొందరగా ఒప్పుకుంటుందనుకో లేదు. కుటుంబ గౌరవం (ఎవరిది) మంట కలిసిందని నెత్తీ నోరూ బాదుకోలేదు. 'నా బంగారు తల్లి ధైర్యమైనది. న్యాయానికి ధర్మానికి నిలబడగలిగింది నా తల్లి భార్యని భార్యగా చూడలేని భర్త దగ్గర వూడిగం చెయ్యడం కంటే విస్తరాకులు కుట్టుకు బతకడం నయం. నే వద్దంటున్నా మీ నాన్నగారు చదివించారు. అది మంచిదైంది' అంది. ఈ ఉత్తరం చేరేసరికి అమ్మ నీ దగ్గరికే వచ్చేసి ఉంటుంది.

ఒక్కోసారి మనం పాతకాలం వాళ్లు అనుకున్న మనుషులు ఎంతో అవగాహనతో మననీ మన పరిస్థితులనీ, మన మనస్తత్వాలనీ అర్థం చేసుకోగలరు. కాలంలో లేదు అవగాహనా శక్తి సోక్రటీస్ కాలంలోనూ, ఈ రోజూ అపారమైన అవగాహనా శక్తి కలిగిన వాళ్ళున్నారు. కించిత్ ఆలోచనా లేని ''మొరపటాలు'' ఉన్నారు. ఈ పదం అమ్మభాషలోకి ఎలావచ్చిందో తెలియదు. ఇన్నాళ్లే లింగ్విస్టిక్ సైన్స్ చదువుకుంటున్నా. మొరపటం అన్న మాటకి మూర్ఖత్వానికి ఏదో సంబంధం ఉందని ఎటీమాలజీ సృష్టి యీవేమో.

బాబీకి నా ఆశీస్సులు, అమ్మకి నేను ఈ విషయాలలో ఇంత బరువైనదైనా ఎందుకు ఇన్నాళ్లు దాచిపెట్టానో చెప్పు. ఇతరులకు ఎంత ఆత్మీయులైనా సరే. ఆందోళన కలిగించే విషయాలు, వాళ్లు ఆ విషయంలో చెయ్యగలిగిన దేదీ లేనప్పుడు వూరికే చెప్పడం వాళ్లకి అదుర్దా కలిగించి బాధపెట్టడమే అవుతుంది. అని మనం ఇద్దరూ అనుకునే ఆవిడకిది తెలియ చెయ్యలేదని చెప్పు.

రోజులు ఒకే మాదిరి ఉండిపోవన్నది కేవలం క్లీషేకాదు. రోజూ మనం మననం చేసుకోదగిన

నిజం. స్పెషలీ సో వెన్ థింగ్స్ ఆర్ నాట్ వెరీ బ్రైట్.

బావను నువ్ మరిచిపోవడం అన్ని విధాలా శ్రేయస్కరం, జీవితాలకు సంబంధించిన నిర్ణయాలు, ఎంత జాగ్రత్తతో, ముందు చూపుతో తీసుకున్నా కొన్ని పరిస్థితులలో అవి వక్రించడం పుస్తకాలల్లో చదువుతూనే ఉన్నాం. మన కుటుంబంలో అది అనుభవానికి వచ్చింది.

నీ ధైర్యానికి ఆత్మవిశ్వాసానికి మీ వదిన నిన్ను తలుచుకోని రోజు లేదు. ' ప్రతి స్త్రీ మీచెల్లెలి లాంటిదైతే పురుష సామ్రాజ్యమని స్త్రీలు లిబరేషన్ మూవ్‌మెంట్స్, దశాబ్ద పాలనలూ ఇలాంటివేవీ అవసరమయ్యేవి కాదేమో.' అంటుంది.

నేను పంపించిన చెక్కులు ఏ ఒక్కటీ నువ్ క్యాష్ చెయ్యకపోవడమన్నది బాంక్ వాళ్ల వల్లే తెలిసింది. అయినవాళ్ల అభిమానాన్ని కూడా కాదనడం ఆత్మాభిమానమేనని నన్ను అనుకోమంటున్నావా ? ఆల్‌రైట్ నువ్ ఎప్పుడూ గెలుస్తూనే ఉండాలి.

అమ్మ ఖర్చులకుంటుంది. ఈ చెక్కైనా కాష్ చెయ్యి. మీ వదిన మరో ఉత్తరం సావకాశంగా రాస్తుందట.

చాలా కాలం చూశావ్. అన్నని కాబట్టి, నీ కంటే జీవితాన్ని ఓ రెండేళ్ల మేరకు ఎక్కువ చూశాను కాబట్టి చెబుతున్నా, మా ఆఫీసులో ఎకౌంట్స్ ఆఫీసరుకు నీ విషయమంతా తెలుసు. ఆయన నిన్ను చూశానని చెప్పాడు. ఒక పాపను వదిలి ఆవిడ చనిపోయింది. నీకు అతని విషయం నేను ఎన్నో సార్లు ప్రస్తావించడం జ్ఞాపకం ఉండే ఉంటుంది. పాపం చాలా మంచివాడు. పెద్ద కష్టం వచ్చి పడింది. నువ్వు అవునంటే అతన్ని వాళ్తేరు తీసుకొస్తా. నీ విషయం పూర్తిగా తెలుసుకుని నిన్ను చేసుకుంటానని ముందుకొస్తున్నాడు. అమ్మతో కూడా ఈ విషయం చర్చించి నీ ఉద్దేశం చెప్పు.

–''అన్నయ్య.''

''బస్సులో వాళ్లు మన వంక చూసిన చూపులు చూసి మీరేమనుకున్నారు ?'' టక్కున అడిగింది, ఆలోచన నుంచి తెప్పరిల్లుకున్న పంకజం.

'' వాళ్లు మీ వంక చూశారని మీకెలా తెలుసు ?''

'' వెన్నులో ఏదో గుచ్చుకుంటున్నట్టయితే ....''

'' చాలా తమాషాగా మాటాడతారే ... మిమ్మల్ని చూడగానే మీలో ఇంత సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉందని అనుకోవడం చాలా కష్టం.''

'' అనుకోకపోతే పోయింది. ఎవరి బతుకును వాళ్లను బతకనిచ్చేపాటి మనో వైశాల్యం లేని మనుషుల్ని చూస్తే మీ కేమనిపిస్తుంది ? చెప్పండి.''

'' భగవంతుడికి బుద్ధి లేదనుకోడం అనుకున్న వారి బుద్ధి కుశలతకి నిదర్శనం కాదనేమో నని నా అనుమానం.

'' చాలా సున్నితంగా మాటాడతారు మీరు. యూ కుడ్ హేవ్ సెడ్ ఐయామ్ స్టుపిడ్.

'' భలేవారండీ మీరు.....'' నవ్వుతూ అంది పంకజం .

'' ఎంత అందంగా నవ్వుతారు మీరు.''

'' అలాగా నా నవ్వుని పొగడిన మొదటివారు మీరే. ఇందులో అబద్ధంలేదు. కాని

మళ్లీ నవ్వుతూనే అడిగింది. '' ఎంత అందంగా నవ్వుతున్నానో చెబుదురూ.

''చెప్పనా .... ఆ చెబుతా .. జస్ట్ ఏ మినిట్.... ఆ.....నౌ ఐ గెట్‌ఇట్... వెన్నెల'' వెల్లువైనట్లు కలువ కన్నె నవ్వినట్లు ప్రకృతి పరవళ్లు తొక్కుతున్నట్లు, ఆకాశం పరిమళించినట్లు.....''

'' ఆ... చాలు. ఇంకా మీరు చెప్పుకుంటూ పోతే పుస్తకంలో రాసుకుని కంఠస్థం చేస్తే కాని గురుండవ్.''

మళ్లీ నవ్వింది పంకజం.

'' బాగుంది. మరి నేను ఒకటి అడుగుతా, నిజంగా చెబుతారా ?''

'' అయ్యో, అంత అనుమానమెందుకూ, అడగండీ ?''

.'' మీరు నడుస్తున్నంతసేపూ ఇందాక, అంటే మనం ఇక్కడ ఇసకలో కూచునే ముందు దేని గురించో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు. దేని గురించి ?''

'' అన్నయ్య ఉత్తరం గురించి, మళ్లీ పెళ్లి గురించి ''

'' అయామ్ గ్లాడ్. నిజంగా నాకు చాలా ఆనందంగా ఉంది. వివరాలు నాకు తెలియవ్. నేను మిమ్మల్ని అడగదలుచుకోలేదు. ఆ నోట ఈ నోట తెలిసినంత మట్టుకు చాలు. ధైర్యంతో జీవనపోరాటంలో ముందు అడుగు వెయ్యబూనడం విజ్ఞతకు నిదర్శనం. కాలం మారుతోంది. మనుషులూ, విలువలూ మారుతున్నాయి. ఎవరి జీవితాన్ని వాళ్లు సుఖమయమయ్యేట్టు ఎవరికి వాళ్లు తీర్చి దిద్దుకోవాలి. పరిస్థితుల ఒత్తిడికి లొంగిపోవడం దేవుడి లీల అనడం, ఓ విధమైన మానసిక నిస్తేజానికి నిదర్శనం..... ''

'' చాలా పెద్ద లెక్కరిచ్చేస్తున్నారు ... నాకు ఆకలేస్తోంది.....''

'' ఇదిగో ఈ చాకలెట్ తీసుకోండి ... అలా వెళ్లి క్యాంటీన్‌లో .....''

'' నెల చివర ... ''

'' నా దగ్గర చాలా డబ్బుంది.''

'' వ్యక్తిగతమైన ప్రశ్న అని మీరు కసురుకోకుండా ఉంటే, మీకు బరువులూ, బాధ్యతలూ...'' లేస్తూ అడిగింది పంకజం.

''' లేనట్టే, నాజీవితంలో ఇంకొకరికి పంపించాలనే బాధలేదు. నా వంతుకు వచ్చే పొలం మీద ఆదాయం అన్నయ్య నాకు పంపుతూనే ఉన్నాడు. అమ్మ అన్నయ్య దగ్గర తప్ప నా దగ్గర ఉండదు. పిల్లలతో వదినె ఒక్కర్తీ చేసుకోలేదంటుంది. ముందుచ్చిన చెవుల కంటే వెనకొచ్చిన కొమ్ములే కదా వాడి .... సారీ, మీకు ఆకలిగా ఉందన్నారు. ''

ఇద్దరూ నడక ప్రారంభించారు.

'' నాన్నగారు పోయి పదేళ్లయింది. అన్నయ్య నా చదువు సంగతి చూశాడు. యమ్.కామ్. చేసి మరో ఉద్యోగం కోసం విశాఖ వచ్చాను. ఏదీ కలిసిరాక ఇంటికెళ్లే ఇష్టంలేక ఇక్కడ గుమస్తా గిరీలో ఇరుక్కున్నాను. నాకు పెద్ద ఉద్యోగం ఇస్తానన్న పెద్ద మనిషి నిజంగా పెద్ద ఉద్యోగం ఇవ్వబోయాడు. వాళ్ల అమ్మాయిని చేసుకోమన్నాడు. నేను వెనక్కివచ్చేశాను. దైవికంగా చిన్నదైనా ఇది దొరికింది. మంచి రోజులు వస్తాయని నమ్మకం. ఇక్కడకు వచ్చినందుకు నాకు విచారం లేదు. మిమ్మల్ని కలిశాను..... నిజం చెప్పండి. నేనంటే మీకు ఎలాంటి అభిప్రాయం ఉంది?''

'' చాలా మంచి అభిప్రాయం ఉంది. అంతకంటే నన్నేం అడగకండి. ప్లీజ్.''

'' సంతోషం . మిమ్మల్ని వత్తిడి చెయ్యడం నాకు ఇష్టం లేదు. కానీ మీ పెళ్లి విషయం మీ అమ్మ గారితో చర్చించడం న్యాయమేమో.''

'' ప్రమాదం.'' కరుణ చెయ్యి పట్టుకుని పేవ్‌మెంట్ మీదకు లాగింది పంకజం. అవతల ఏదో కొంప తగలబడిపోతున్నట్లు ఎనభై కిలోమీటర్ల వేగంతో కారు దూసుకుపోయింది.

'థాంక్యూ... నా ప్రశ్నకి సమాధానం ఇచ్చారు కాదు.''

''ప్రపంచంలో అభిమానించడం ఎంత సులభమో, అభిమానాన్ని చూర గొనడం అంత కష్టం. ఈ మూడు నాలుగు నెలలుగా మీరు నా ఎడల చూపిస్తున్న అభిమానానికి నేనెంతో కృతజ్ఞురాలిని.... అమ్మకి మీరంటే ఎంతో గౌరవం, బాబీ మిమ్మల్ని అంకుల్, అంకుల్ అని తెగ గుర్తు చేస్తూ ఉంటాడు. నా మనస్సులో మీరు లేని క్షణం ఉండదని తెలియక .....''

ఇద్దరూ క్వాలిటీ లో అడుగుపెట్టారు.

'' కూచోండి ''

ముందు మీరు కూచోండి.

''ఏం తీసుకుంటారు ? ''

''ఏదో ఒకటి ... ''

'' పూరీ రెండు ప్లేట్లు'' ఆర్డర్ చేసి సర్వర్ వెళ్లిపోయాక కరుణ అన్నాడు.... '' సారీ, మీరు ఏవో చెబుతున్నారు....''

'' మీ రంటే మా అందరికీ గౌరవమే.''

'' సంతోషం , కాని మీరు అన్నారే ఇంకొకటి విషయం ఆలోచిస్తానని మీ నిర్ణయం ?''

'' ఇప్పుడింతలో ఎందుకంత తొందర ?'' నవ్వుతూ అంది పంకజం.

'' సరే మరో అరగంట ఆగుతా.''

టిఫిన్ కాఫీ తీసుకుని మళ్లీ ప్రశాంత వాతావరణంలోకి, సముద్రపొడ్డుకి వచ్చారు వాళ్లిద్దరూ.

'' ఈ రోజు సముద్రం చాలా ప్రశాంతంగా ఉంది కదూ?'' పంకజం అడిగింది.

.....''

''ఏమిటో ఆలోచిస్తున్నారు?''

.....''

పంకజం మరి అతని ఆలోచనకి అంతరాయం కలిగించదలచుకోలేదు. ఇసకలో చక్రాలు రాస్తోంది కుడికాలి బొటన వ్రేలితో... మరో క్షణంలో కడలి పొంగుతో పరవళ్లు తొక్కితే అవి చెరిగిపోతాయి. కడలి వయసు ముందు ఈ చక్రాల వయసెంత ? విలువెంత ? చక్రాలు చాలా అయ్యాయి.

'' మీరు అలా అనుకుంటుంటే, ఆఫీసులోని పంకజం. మీరూ ఒకరేనా అనిపిస్తోంది.''

'' హమ్మయ్య. ఇక బాహ్య ప్రపంచంలోకి వచ్చారన్నమాట.''

'' అరగంటయ్యింది. మీ సమాధానం కోసం చూస్తున్నా.''

'' సమాధానం ?''

'' అది ప్రశ్న.''

''భలే మాటాడతారండీ.''

'' ఇదీ సమాధానం కాదు ... ప్లీజ్, పంకజం, 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను' అని చెప్పడం నాకైతే ఎందుకో ఎబ్బెట్టుగా ఉన్నట్లు అనిపిస్తూంది. ఆల్‌రైట్... విల్ యూ మేరీ మీ ?''

'' ఐ లవ్ యూ.''

'' అది పూర్తి సమాధానం కాదు.''

'' చీకటి పడిపోతూంది మరోసారి తీరికగా మాటాడుకుందాం. అమ్మ ఏమైనా అనుకుంటుంది. లెండీ వెళదాం.''

ఇద్దరూ సాలోచనగా ఆర్. కె. మిషన్ బస్ స్టాప్ దగ్గర కొచ్చారు. ముందు టౌను వైపు వెళ్లే బస్సొచ్చింది.

''మీరు వెళ్లండి '' అంది పంకజం.

''మిమ్మల్ని వదిలేసి ఎలా వెళ్లనూ ?''

''అదిగో నా బస్సూ వచ్చింది, ఇక వెళతారా పోనీ ?''

ఇద్దరూ చెరో వంక బస్సు ఎక్కిపోయారు.

మరుసటి రోజు పంకజానికి జ్వరం. సెక్షన్‌లో ఈ విషయం తెలుసుకుని కరుణ ఆమె ఇంటికి వెళాడు.

''ఎలా ఉంది ?''

'' ఫరవాలేదు.''

''డాక్టరు దగ్గర కెళ్లారా ? ఏమన్నాడు ?''

'' ఫ్లూ ''

'' నాకు బాంకులో ప్రొబేషనరీ ఆఫీసర్ ఉద్యోగం వచ్చింది. నాలుగు రోజుల్లో రిలీవ్ చేస్తున్నారు....''

''కంగ్రాచ్యులేషన్స్. ఆల్ ది బెస్ట్ ''

'' అంతేనా ?''

'' అంటే ?''

'' పంకజం, నా మనసు నీకు చెప్పాను...లెట్ అజ్ గో టుగెదర్ .... నువ్ ఇక్కడ ఉద్యోగం చెయ్యనక్కర లేదు... భగవంతుడి దయవల్ల నాకు కొంత పిత్రార్జితం ఉంది. నీకేలోటూ లేకుండా చూసుకుంటా .... మంచి ముహూర్తం ఎప్పుడుంటే అప్పుడు పెళ్లి చేసేసుకుందాం. అమ్మ నేనసలు పెళ్లే చేసుకోనేమోనని భయపడిపోతుంది. ఎవరిని చేసుకున్నా సంతోషమేనంటుంది అమ్మ. అన్నయ్య సరేసరి.''

'' థాంక్యూ.''

'' చాలా నీరసంగా ఉందా ?''

'' లంఖణం ....''

'' రేపటికి తగ్గిపోతుంది. డోన్ట్‌వర్రీ .... పండ్ల రసం బాగా తీసుకో...''

'' అన్ని పళ్లే , ఎందుకండీ అలా డబ్బు ఖర్చు చేస్తారు ?''

'' బాగుంది. నీ ఆరోగ్యం కంటేనా ?''

ఒక రోజు జ్వరం అలా అలా రోజూ వస్తూ పది రోజులైపోయింది. డాక్టరు మందులు మారుస్తూనే ఉన్నాడు.

రిలీఫ్ ఆర్డరు పట్టుకుని వెళతానని చెప్పడానికొచ్చాడు కరుణ. పంకజం మంచం మీద నుంచి లేచి కూచోబోయింది.

'' కూచోకు నే మరి వెళ్లాలి... రేపు హైదరాబాద్‌లో ట్రైయినింగ్‌లో జాయినవుతా అక్కడనుంచి ఎక్కడికి వెళ్లాలో, అక్కడే ట్రైయినింగ్ ఉంటుందో తెలియదు. పంకజం... ఆల్ రైట్, గెట్ వెల్ సూన్.''

బాబీని ముద్దు పెట్టుకుని పంకజం తల్లి ఆశీస్సులు తీసుకుని కరుణ వెళ్లిపోయాడు.

హైదరాబాదు వెళ్లాడే కాని కరుణ మనసు వాల్తేరులోనే ఉంది. వారం తిరిగేలోగా రెండు ఉత్తరాలు రాశాడు పంకజానికి. తీరా ఆదివారం వచ్చేసరికి యూ ప్లీజ్ కమ్ టుది ఆఫీస్ ఆన్ సన్‌డే. వియ్ విల్ క్లియర్ ది బాక్‌లాగ్. అన్నాడు ఆఫీసరు.

'' కమింగ్ నెక్స్ట్ సన్ డే వైర్ వెల్‌ఫేర్'' అని టెలిగ్రామ్ ఇచ్చాడు కరుణ. కరుణకి మరో నాలుగు రోజుల తరువాత ఆఫీసులో పంకజం రాసిని ఉత్తరం అందింది.

'' మైడియర్ కరుణగారూ !

నా ఆరోగ్యం కుదుటపడింది. దేవుడి దయ, అమ్మ బాబీ మిమ్మల్ని తలుచుకుంటూనే ఉన్నారు. నా సంగతి మీకు వేరే చెప్పనక్కరలేదనుకుంటాను. రేపు ఆదివారం తరువాత సోమవారం సెలవు కలిసి వస్తుంది. మీ టూత్ బ్రష్ తప్ప మరేమీ తెచ్చుకోకండి.

మీ కోసం అందరం ఎదురు చూస్తున్నాం.

ఇట్లు

'' పంకజం''

కరుణ ఉత్తరం అందరికి చూపించెయ్యాలన్నంత సంతోషంలో పడిపోయాడు. కాని తన కింకా హైదరాబాదులో ఎవరితోనూ అంత స్నేహం అవలేదు. తనను చూసినప్పుడల్లా మొగ్గల్లాంటి పలువరసతో నవ్వే టైపిస్టు అమ్మాయికి ఆ ఉత్తరం చూపించాలనే ఉన్నా, ఆమె ఇది పూర్తిగా అర్థం చేసుకోలేదనుకుని ఆ ప్రయత్నం వదులుకున్నాడు.

శనివారం వచ్చింది. సాయంకాలం వచ్చింది. గోదావరి వచ్చింది. పంకజం స్టేషనుకు వచ్చింది.

ఆటోలో ఇద్దరూ ఇల్లు చేరుకున్నారు.

స్నానం చేసి బయటకు వస్తున్న కరుణ ఇంట్లో ఇంతకుముందెప్పుడూ కనపడని పురుషుడి సరంజామా కనపడింది.

''మీ అన్నగారు వచ్చారా ?''

''హలో, వచ్చేశానండీ! నేను స్టేషనుకు వస్తానంటే వద్దంది పంకజం. బజారుకెళ్లి కూరలు, పళ్లూ తెచ్చా ? రిజర్వేషన్ దొరికిందా ?''

ఎంతో కాలం నుంచి తెలిసిన వాడిలా మాటాడేస్తున్నాడాయన.

'' పంకజం నాకంతా చెప్పింది. యూ ఆర్ లవింగ్ హెర్. షి లవ్డ్ యూ, ఐయామ్ హాపీ. నాకంటి మసక తొలగింది. పంకజం ఈజ్ ఎ గ్రేట్ వుమెన్ ఐ లవ్ హెర్. షి ఈజ్ మై వైఫ్.''

ఈజ్ మీద వత్తి ఇంకా ఏమిటేమిటో చెప్పుకుపోతున్నాడాయన.

బాబీ ఎత్తుకోమని కరుణకు చేతులందించాడు.

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక
5-7-78